www.teluguone.com

# గురువును మించిన శిష్యుడు

జె.ఆర్.లక్ష్మి

సుబ్బారావుకు రచయితగా పేరొచ్చింది. కానీ అతను ప్రజలతో అట్టే సంబంధం బాంధవ్యాలేర్పరచుకోకుండా తనేమో తన రచనలేమో అన్నట్లుంటున్నాడు. అతని చుట్టు ప్రక్కల వాళ్ళకు అతను రచయిత అన్న విషయం కూడా తెలియదు. తెలిసిన వాళ్ళ దగ్గర అతను తన రచనల గురించి మాట్లాడడు.

గుడ్డల్లో నిప్పును దాచలేరు. క్రమంగా చుట్టు ప్రక్కల వాళ్ళకు సుబ్బారావు రచయిత అన్న విషయం తెలిసిపోయింది. ఆ కారణంగా అతనితో పరిచయం కోరే వారి సంఖ్య కూడా పెరిగింది.

సుబ్బారావు తన వద్దకు వచ్చిన వాళ్ళని వాళ్ళ గురించి అడిగి తెలుసుకుని, వాళ్ళ చేతే ఎక్కువ మాట్లాడించి, వాళ్ళ నుంచి తనకు తెలియనివి తెలుసుకుని, వాళ్ళ జ్ఞానాన్నీ పరిజ్ఞానాన్నీ అభినందిస్తుండేవాడు. అతనిలో అతిశయమన్నది మచ్చుక్కుడా కనపడేది కాదు. అందరూ సుబ్బారావుని మెచ్చుకున్నారు. మెచ్చుకుంటున్నారు.

అతని ఊళ్ళోని కొన్ని సంస్థలు స్కూళ్ళు సుబ్బారావును సన్మాన సభలకు పిలిచాయి. అతను మృదువుగానే నిరాకరించాడు. అయినా బలవంత పెట్టిన వారికి..."పబ్లిక్ ఎక్స్‌పోజర్ నన్ను సామాన్య జీవితానికి దూరం చేస్తుంది. నేను రచయితను కావాలనుకున్నాను తప్ప సామాన్య జీవితానికి దూరం కావాలనుకోలేదు" అని చెప్పేవాడు.

సుబ్బారావుకు కీర్తి ప్రతిష్ఠలపైన, మెహర్బానీ పైన మోజు లేదని, అతని వినయ సంపత్తి ఇంతా. అంతా కాదనీ అంతా చెప్పుకోసాగారు. సుబ్బారావు భార్య పార్వతి మాత్రం దీనికెంతో బాధపడేది. ఎందుకంటే సుబ్బారావుతో పాటు చాలాసార్లు ఆమెనూ సభలకు పిలిచారు. ఒక రచయిత భార్యగా వెళ్ళి వేదిక నెక్కాలని ఆమెకు మహా కోరికగా ఉంది. కానీ సుబ్బారావు కారణంగా అది ఎలా వచ్చిందో అలాగే పోతోంది.

"...ఓ మూల కూర్చుని రచనలు చేస్తే మీకు పేరు రాదు. వేదికలెక్కడి. నలుగురిచేతా ఆరాధన పొందండి. పది మందికి ఇంటర్వ్యూ ఇవ్వండి. మీరు పేరు తెచ్చుకుని నాకు గుర్తింపు తెండి" అంది పార్వతి చాలా సార్లు.

"నాకు వేదికనెక్కాలంటే భయం. కాళ్ళు వణుకుతాయి. మనింట్లో ఎన్ని కబుర్లయినా చెబుతాను. కలం పట్టుకుంటే ఎన్నయినా రాస్తాను. వేదికనెక్కానంటే నా బలహీనత బయటపడుతుంది. అది బయటపడకుండా కాపాడుకుంటున్నాను. నన్ను వేధించకు" అనేవాడు సుబ్బారావు ప్రతిసారీ.

పార్వతికి భర్త మాటల మీద నమ్మకం కలగలేదు. తనకిష్టంలేక ఏదో వంక పెట్టి వదిలించుకుంటున్నాడని అనుకుందామె.

ఇలా ఉండగా సుబ్బారావు, పార్వతి ఒక రోజున పెళ్ళికెళ్ళారు విజయవాడ. అక్కడ వారికి కలిశాడు కోదండపాణి.

కోదండపాణి సుబ్బారావు కంటే పదేళ్ళు పెద్ద. ఆయన సుబ్బారావుకు గురుతుల్యుడు. సుబ్బారావు కాలేజీలో చదువుకునే రోజుల్లో కోదండపాణి బడిపంతులుగా వారి పక్కింట్లోనే ఉండేవాడు. ఆయన సుబ్బారావు ఆలోచనల్ని సరిదిద్ది సంపూర్ణత్వం చేకూర్చాడు. భావాలకు అక్షర రూపమెలా ఇవ్వాలో నేర్పాడు. అప్పట్లో సుబ్బారావు ఆయనని ఆరాధించాడు.

ఇపుడు సుబ్బారావు పేరున్న రచయిత అని తెలిసి ఆశ్చర్యపోయాడు కోదండపాణి.

"మాస్టారూ! మిమ్మల్నిక్కడిలా కలుసుకుంటానని తెలిస్తే నేను నా రచనలన్నింటినీ మీ కోసం తెచ్చి - మీ చేత చదివించి - విమర్శింప జేసి ఉండేవాణ్ణి" అన్నాడు సుబ్బారావు.

"నే నిక్కడికి వచ్చి ఆర్నెల్లయ్యింది. మన ఒకరినొకరు కలుసుకుని రెండార్లు పన్నెండేళ్ళయింది. అంతా విధి లీల..." అన్నాడు కోదండ పాణి.

ఇద్దరూ కాస్సేపు పిచ్చాపాటీ మాట్లాడుకున్నాక కోదండపాణి "సుబ్బారావ్! నువ్వు నా స్కూల్లో వేదికనెక్కి ఉపన్యాసమివ్వాలి -

నా విద్యార్థులు నీ గురించి తెలుసుకుని ప్రభావితులు కావాలి. ఆలోచనలను సరిదిద్దే ఉ పాధ్యాయుడు - తన విద్యార్థులనే కాదు - ప్రతి పరిచయస్తుడినీ వక్తగా తీర్చిదిద్దగలడని నా విద్యార్థులు తెలుసుకోవడం ఎంతైనా అవసరం...." అన్నాడు కోదండ పాణి.

సుబ్బారావు తడబడ్డాడు. భయపడ్డాడు. అంత వరకూ తానెక్కడా వేదిక నెక్కలేదనీ మరీ మరీ చెప్పుకున్నాడు. అప్పుడు కోదండ పాణి సుబ్బారావు భార్యను పిలిచి నిజానిజాలు విచారించాడు.

పార్వతికి మంచి అవకాశమనిపించింది.

"వారెప్పుడూ వేదికనెక్కరు. వారి చేత కలం పట్టించిన గురువు మీరు తొలిసారిగా మీరే వేదికనెక్కిస్తే నేనెంతో సంతోషిస్తాను. భార్యగా నేను సాధించలేనిది మీరు సాధించగలరు. ఆయనకు
గురుభక్తి ఎక్కువ" అందామె.

సుబ్బారావు ఇరుకున పడ్డాడు.

"నీకు నా మీద గురుభావముంటే నేను చెప్పినట్లు విని తొలిసారిగా నిన్ను వేదికనెక్కించి ఘనత నాకు లభించేలా చేస్తావు...." అనేశాడు కోదండ పాణి.

చిట్ట చివరికి సుబ్బారావు అంగీకరించాడు. అయితే అందుకు అతను ఒక షరతు పెట్టాడు. కోదండపాణి కూడా అతనితో పాటు వేదికనెక్కడమే కాక ముందుగా - నేటి సాహిత్యపు తీరుతెన్నుల గురించి ఉపన్యసించాలి.

కోదండపాణి దీనికి అంగీకరించాడు. పార్వతికి కలిగిన సంతోషమింతా అంతా కాదు. మర్నాడే కోదండపాణి హెడ్మాస్టరుగా పని చేస్తున్న స్కూల్లో సుబ్బారావుకు సన్మాన సభ ఏర్పాటయింది. వేదిక పైన సుబ్బారావును విద్యార్థులకు, సభకు విచ్చేసిన పుర ప్రముఖులకు కూడా పరిచయం చేశారు. సభాధ్యక్షుడు సుబ్బారావును ప్రసంగించమని కోరాడు.

సుబ్బారావు లేచి నిలబడి - "తను సైంటిస్టు కాకున్నా సైంటిస్టులను తయారు చేస్తాడు ఉపాధ్యాయుడు. తను రచయిత కాకున్నా రచయితను తయారు చేస్తాడు సమాజ శ్రేయోభిలాషి. ఈ రెండూ కలిసిన కోదంపాణి గారు లేకపోతే నేనీరోజు రచయితగా ఈ విధంగా మీ ముందు వేదిక నెక్కి ఉండేవాణ్ణి కాదు. సాహితీ పరుల కంటే సాహితీ విమర్శకులకే సాహిత్యం గురించి ఎక్కుగా తెలుస్తుందనడానికి ఈ రోజు మా గురువు గారు నేటి సాహిత్యపు తీరు తెన్నులపైన ఉపన్యాసం ఒక ఉదాహరణ అవుతుంది. వారు నాకు గురుతుల్యులు. ముందు వారు ప్రసంగించినాకనే నేను ప్రసంగం ప్రారంభిస్తాను" అన్నాడు.

"సుబ్బారావు మన అతిథి. అతని ఉపన్యాసం తరువాతనే నా ఉపన్యాసం" అన్నాడు కోదండపాణి.

"అతిథిగా ఎవరినుంచైనా గౌరవం పొందగలను. గురువు నుంచి కాదు" అన్నాడు సుబ్బారావు
వెంటనే.

ఇద్దరిలో ఎవరి ఉపన్యాసం ముందుండాలన్నది చర్చనీయాంశంగా మారింది సభాధ్యక్షుడు మధ్యలో
కలగజేసుకుని..."సుబ్బారావు గారి గురు భక్తి, వినయం అద్భుతం. అది మీ అందరికీ ఆదర్శంగా ఉండాలన్న భావంతో వాటిని గౌరవిస్తూ ముందుగా కోదండపాణి గారిని ప్రసంగించమని కోరుతున్నాను"అన్నాడు.

కోదండపాణి తన ఉపన్యాసాన్ని ప్రారంభించక తప్పలేదు. ఆ తరువాత సుబ్బారావు కూడా ఉపన్యసించాడు.

తొలిసారిగా భర్త వేదికనెక్కి ప్రసంగిస్తుంటే ముచ్చటగానూ, మురిపెంగానూ వింది పార్వతి. అతని ఉపన్యాసం ఆమెకు అద్భుతంగా అనిపించింది. మధ్య సభికుల కరతాళధ్వనులామెకు తన అభిప్రాయం సరైనదే అనిపించేలా చేశాయి.

ఇంటికి వెళ్ళాక ఆమె భర్తను నిలదీసి - "మీ ఉపన్యాసం ఎంతో గొప్పగా ఉంది ఇంత కాలం నా కెందుకు అబద్ధం చెప్పారు?" అంది.

సుబ్బారావు నవ్వి ఊరుకున్నాడు.

"మీరు వేదిక మీద అనవసరంగా ఫార్సు క్రియేట్ చేశారు. మీరే ముందుగా ఉపన్యాసమిస్తే ఏమయ్యేది? మీ గురుభక్తి నాటకమనీ, షో అనీ కొంత మంది పరిహాసం చేశారు" అంది పార్వతి

సుబ్బారావు నవ్వి-"నా గురు భక్తి నాటకం కాదు. షో కాదు... అవసరం" అన్నాడు సుబ్బారావు.

“అవసరమేం కాదు. మీకు కట్టుకున్న భార్య కంటే కూడా గురువంటేనే గౌరవం. ఎప్పుడూ వేదికనెక్కని మీ చేత మీ గురువు గారు మాత్రమే వేదికనెక్కించగలిగారు. గురు భక్తి తప్పని నేననను. కానీ భార్య మాటక్కూడా ఎంతో కొంత విలువివ్వాలి” అంది పార్వతి ఉక్రోషంగా.

సుబ్బారావు నవ్వి “అసలు సంగతి చెప్పనా?” అన్నాడు.

“అసలు సంగతంటూ వేరే ఉందా?” అంది పార్వతి.

“ఉంది.. కోదండ పాణి గారు గొప్ప సాహితీ విమర్శకులు. అటు ప్రాచీన సాహిత్యాన్నీ, ఇటు ఆధునిక సాహిత్యాన్ని కూడా కాచివడపోశాడాయన. కానీ ఆయనకూ నాలాగే వేదికనెక్కాలంటే గుండె దడ, వణుకు. అప్పట్లో ఆయన నాతో అంటూండేవాడు - నాకున్న పేరు వల్ల అప్పుడప్పుడు వేదిక నెక్కాల్సి వస్తుంటుంది. క్లాసులో విద్యార్థుల్ని ఉపన్యాసంతో గడగడలాడించగలను, కలంతో కవుల్నీ రచయితల్నీ వణికించే నేను. - వేదిక మీద మహా బలహీనుణ్ణి. వేదికనెక్కడం తప్పించుకోవడానికే ప్రయత్నిస్తుంటాను. మరీ తప్పనిసరి అయితే మాత్రం ముందుగా నాకంటే చెత్తగా మాట్లాడే ఒక మనిషి నెన్నుకుంటాను. అంటే వాడి ఉపన్యాసమయ్యాక సభికులకి ఇంకెవరి ఉపన్యాసమైనా బాగానే ఉంటుది. - అని . ఈ రోజు ఆయన ట్రిక్కును నే నాయన మీదే ప్రయోగించాను. నా ఉపన్యాసం నిజంగా కనుక బాగుంటే అప్పటికీ, ఇప్పటికీ కోదండపాణి గారి ఉపన్యాస ధోరణిలో మార్పేమీ లేదనే తెలుస్తోంది”

పార్వతి ఆశ్చర్యపోయింది. అప్పుడామెకు స్ఫురించింది. కోదండపాణి తన ఉపన్యాసంలో ఎన్నో విషయాలు చెప్పాడు. కానీ ఒక్కటీ ఆసక్తికరంగా లేదు. ఉపన్యాసం ఎప్పుడైపోతుందా అనిపించింది.

“పార్వతీ! మళ్ళీ కోదండపాణి గారి వంటి వారు దొరికేవరకూ నన్ను వేదికనెక్కమని బలవంత పెట్టకు” అన్నాడు సుబ్బారావు.